సమస్యలు విని.. అధికారులతో మాట్లాడి...

● ప్రజావాణికి 308 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి 308 దరఖాస్తులు వచ్చాయి. స్టేట్ నోడల్ అధికారి దివ్య దరఖాస్తులను తీసుకొని వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 104, విద్యుత్‌కు 18, రెవెన్యూకు 44, ఇందిరమ్మ ఇళ్ల కోసం 65, ఇతర శాఖలకు 77 దరఖాస్తులు అందినట్లు అధికారి తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి దివ్య

మోడల్స్ సందడి

అమీర్‌పేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో ఉన్న జీఎంఆర్ అరీనాలో మే 23 నుంచి హైదరాబాద్ ఇంటర్నేషనల్ జువెలరీ షో-2025 నిర్వహించనుండగా మంగళవారం సినీ నటి స్రవంతి చొక్కారపు, ఇతర మోడళ్లు ఆభరణాలు ధరించి ర్యాంపుపై క్యాట్ వాక్ చేశారు. అనంతరం అమీర్‌పేటలోని హోటల్ మారీగోల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో వివిధ జువెలర్స్ సంఘాల ప్రతినిధులు షో పోస్టర్‌లను ఆవిష్కరించారు. మే 25 వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో దేశ విదేశాలకు చెందిన ఆభరణాల తయారీదార్ల స్టాళ్లు ఏర్పాటు చేస్తారని యునైటెడ్ ఎగ్జిబిషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.కె. మనోజ్ తెలిపారు. 400 పైగా రకాల బ్రాండ్ల నగలను ప్రదర్శిస్తారని వెల్లడించారు.



హోటల్ మారీగోల్డ్‌లో మోడల్స్

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

పంజాగుట్ట, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ సభ్యుడు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ సభ్యుడిగా ఆయన్ను ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్రె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించారని, మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అథారిటీ సభ్యులందరం కలిసి పని చేస్తామన్నారు. నల్గొండ ఉమ్మడి జిల్లా మోత్కూరు మండలం సదరసాపురానికి చెందిన వెంకటేశ్వర్లుకు సమాచార కమిషన్ మాజీ ప్రధాన కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది.



సీఎం రేవంత్‌ను కలిసిన రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు



జయంతి పోస్టర్‌ను అవిష్కరిస్తున్న బసవ జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు

నేడు రవీంద్రభారతిలో బసవేశ్వర జయంతి

● హాజరుకానున్న సీఎం రేవంత్

పంజాగుట్ట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): విశ్వగురు మహాత్మా బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని బసవ జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం రవీంద్రభారతిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం అధ్యక్షుడు పి. సంగమేశ్వర్, ఎస్.సతీష్ కుమార్, కల్వ మల్లికార్జునప్ప, సంఘం గ్రేటర్ అధ్యక్షుడు పి.శివశరణ్, తదితరులు పోస్టర్ ఆవిష్కరించారు. సీఎంతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పాల్గొంటారన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు జగదీష అప్ప, అనిల్ అప్ప, బస్వరాజ్, ఉమామహేశ్వర్, శెట్టి శివకుమార్, పి.పరమేశ్వర్, రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు పి.భరత్, ప్రధాన కార్యదర్శి కె. సోమేశ్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మైదానాల ఇన్‌చార్జీలతో జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అదనపు డైరెక్టర్ రహీనా బేగం తదితరులు

మెరుగైన శిక్షణకు ప్రాధాన్యం

ఖైరతాబాద్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించాలని జీహెచ్ఎంసీ క్రీడా విభాగం అదనపు డైరెక్టర్ రహీనా బేగం సూచించారు. మంగళవారం ఖైరతాబాద్ జోన్ పరిధిలోని క్రీడా కాంప్లెక్స్‌లు, మున్సిపల్ మైదానాల ఇన్‌చార్జీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శిక్షణలో పాటించాల్సిన నిబంధనలను వివరించిన ఆమె మైదానాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైతే స్థానిక యువత సహకారం తీసుకొని మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. సమయ పాలన కచ్చితంగా పాటించాలని సూచించారు.



గెలుపొందిన క్రీడాకారులు

కురుక్షేత్ర- 2025 క్రీడా పోటీలు విజయవంతం

బంజారాహిల్స్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(జేఎన్ఐఏఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కురుక్షేత్ర 2025 క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆర్కిటెక్ కాలేజీల నుంచి 1500 మందికి పైగా విద్యార్థులు హాజరై సత్తా చాటారు. సోమవారం బహుమతులు ప్రదానోత్సవంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చంద్రిక, జర్నలిస్ట్ స్వప్నలు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కూడా మైదానాలు కనుమరుగవుతున్నాయని వాటిని కాపాడటంతో పాటు క్రీడల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడం ప్రతీఒక్కరి బాధ్యతని అన్నారు. జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి. సురేష్ మాట్లాడుతూ తాము నిర్వహించిన ఈ క్రీడాపోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జెఎన్ఐఏఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ షాలిని పాల్గొన్నారు.

ఇట్లయితే శుద్ధీకరణ జరిగినట్లే?

- మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తున్న అధికారులు
- మరోవైపు సున్నంచెరువులోకి చేరుతున్న మురుగు
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఎస్టీపీ నిర్మాణం
- సవాళ్లను అధిగమించేందుకు హైడ్రా ప్రణాళికలు



సున్నం చెరువులో నుంచి మోటార్లతో మురుగు తొలగిస్తున్న సిబ్బంది



వివిధ ప్రాంతాల నుంచి సున్నం చెరువులోకి చేరుతున్న మురుగు

బోరబండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాలుష్యమయంగా మారిన సున్నంచెరువు శుద్ధీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. చెరువులోని మురుగునీటిని హైడ్రా అధికారులు మోటార్ల ద్వారా బయటికి పంపిస్తున్నారు. చెరువును పూర్తిగా ఖాళీ చేసి మంచినీటితో నింపడమే కాకుండా, చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

● కాని చెరువులోని మురుగు నీటిని తొలగిస్తుంటే, మరోవైపు బోరబండ బలహీనవర్గాల కాలనీకి చెందిన 25 బస్తీలతో పాటు సైట్-3,4,5 కాలనీలు, ఎస్పీఆర్ హిల్స్‌లోని పలుబస్తీలకు చెందిన మురుగు నీరంతా భూగర్భ డ్రైనేజీ, వాన నీటి కాలువల ద్వారా నేరుగా ఇందులోకే చేరుతోంది. చెరువులో మురుగునీరు చేరే ప్రాంతంలో ఎస్టీపీ నిర్మాణం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. బోరుబండ, అల్లాపూర్, మాదాపూర్ డివిజన్లు కలిసేచోట మురుగు చేరుతోంది.

● సున్నంచెరువు శుద్ధీకరణకు ముందు వివిధ బస్తీలు, కాలనీల నుంచి చెరువులోకి మురుగు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది. రోజూ భారీగా మురుగు చేరుతున్న క్రమంలో నీళ్లు బయటకు పంపినా ఫలితం ఉండదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు తగిన చర్యలు చేపట్టి ముందుగా మురుగు చేరకుండా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

రక్షించడం కూడా..

సున్నం చెరువు చుట్టూ కొత్తగా చేపట్టిన నిర్మాణాలను హైడ్రా ఇటీవల కూల్చివేసింది. గతంలో నిర్మాణమైన ప్రస్తుతం వాటిల్లో నివాసముంటున్న వారి విషయంలో హైడ్రా ఇంత వరకు భవిష్యత్ ప్రణాళికను ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో చెరువు రక్షించడం కూడా హైడ్రాకు పెద్ద సవాలుగా మారనుంది. సున్నం చెరువు శిఖం భూమి ఇప్పుడు పూర్తి స్థాయిలో కనుమరుగు అయింది. మళ్లీ పూర్వవైభవం తీసుకురాలేని పరిస్థితుల్లో కనీసం ఉన్న దాన్ని సంరక్షించాలంటే హైడ్రా అనేక కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ముందుగా హద్దులు నిర్ణయించి దాని లోపల ఉన్న నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు బస్తీలో నుంచి వస్తున్న మురుగుకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. ఎస్టీపీ ప్రాజెక్ట్ కింద పైప్‌లైన్‌లు వేస్తే మంచి ఫలితం వచ్చే అవకాశాలు ఉంటాయని పలువురు అంటున్నారు.

ఎటు వైపు మళ్లిస్తారో సమాచారం లేదు

సున్నంచెరువులో నుంచి మురుగు నీటిని హైడ్రా అధికారులు తొలగిస్తున్నారు. బోరబండ ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతాలకు చెందిన బస్తీలు, కాలనీల నుంచి మురుగు ఇంకా సున్నంచెరువులోకి చేరుతోంది. ఈ మురుగును హైడ్రాధికారులు ఎటు వైపు మళ్లిస్తారో మాకు సమాచారం లేదు.

: రాజేందర్, జలమండలి మేనేజర్, ఎస్పీఆర్ హిల్స్ విభాగం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పంజాగుట్ట, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ హిందు ఫీడర్ పరిధిలోని వెంకట్ ప్లాజా, ఒర్రా జువెల్లర్స్ కృష్ణ జువలర్స్, బ్యాటరీ లైన్, పోచమ్మబస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

పుస్తెలతాడు చోరీ

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పుస్తెలతాడు చోరీకి గురైంది. ఈ సంఘటన సనత్‌నగర్‌లోని జెక్ కాలనీలో జరిగింది. సనత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన అడుసుమల్లి సాయి శ్రీలేఖ ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 28న ఉదయం పెస్ట్ కంట్రోల్ నిమిత్తం ఆనంద్ అనే వ్యక్తి వచ్చి కొద్ది సేపటి తర్వాత వెళ్లిపోయాడు. సాయంత్రం బీరువా తీయగా అందులో ఉండాల్సిన 4.4 గ్రాముల బంగారు పుస్తెలతాడు కనిపించడంలేదు. దీంతో వెంటనే అదృశ్యంపై శ్రీలేఖ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోడల్స్.. పీస్ వాక్



ర్యాంప్‌పై పీస్ వాక్ నిర్వహిస్తున్న మోడల్స్

బంజారాహిల్స్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ మోడల్స్ పీస్ వాక్ నిర్వహించారు. గ్లోబల్ యూనిటీ ఎగనెస్ట్ టెర్రరిజమ్ పేరిట బేగంపేట కంట్రీ క్లబ్‌లో పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అనంతరం మోడల్స్ వాటిని చేబూని పట్టుకొని, శాంతి సామరస్యాన్ని ప్రోత్సహించే నినాదాలు ముద్రించిన ప్రత్యేక వస్త్రధారణలో మౌనంగా 'షార్ట్ పీస్ వాక్ చేశారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మర్రి రవీందర్‌రెడ్డి , షేక్ గౌస్

చలివేంద్రం ప్రారంభం

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ మర్రి చెన్నారెడ్డి పేరిట సీనియర్ కాంగ్రెస్ నేత షేక్ గౌస్ ఆధ్వర్యంలో ప్రకాశ్‌నగర్ బస్టాప్‌లో 28 సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి ఈ చలివేంద్రాన్ని చెన్నారెడ్డి కుమారుడు మర్రి రవీంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. మర్రి చెన్నారెడ్డి స్మారకార్థం యేటా చలివేంద్రాన్ని షేక్ గౌస్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయనను అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమేష్, నాయకులు అభిషేక్ అడపా, రాజేందర్, మునీర్‌ఖాన్, హనిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఎర్రగడ్డలో ఏర్పాటు చేయగా దానిని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు ప్రారంభించారు.
బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)

ప్రతీఒక్కరు ఉగ్రదాడిని ఖండించాలి

● నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
● జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని మోదీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె నిరసన తెలిపారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరినీ కలచివేసిందన్నారు. ఉగ్రవాదంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయన్నారు. ఈదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. ఈ ఘటనపై ప్రజలందరూ కులమతాలకతీతంగా ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్లు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. వివిధ పార్టీల కార్పొరేటర్లు, అడిషనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రహ్మత్ నగర్ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బోరబండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ టీ-అంజయ్యనగర్ కు చెందిన ముబీన్ పాషాకు రూ.21 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి మంగళవారం అందజేశారు. రహమత్ నగర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న పేదవారికి వైద్యఖర్చుల నిమిత్తం ఇచ్చే సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదొక వరమన్నారు.

షాపు యజమాని దృష్టి మరల్చి.. బంగారం లాకెట్లతో ఉడాయింపు

● మహిళపై పీఎస్‌లో ఫిర్యాదు

బోరబండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దుకాణదారు దృష్టి మరల్చి ఓ మహిళ రెండు బంగారు లాకెట్లతో ఉడాయించింది. ఈ సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వినాయక రావునగర్‌లోని భాగ్యలక్ష్మి జువెలరీ షాపునకు సోమవారం రాత్రి గుర్తుతెలియని మహిళ వచ్చింది. నగలు చూపించాలని కోరగా దుకాణదారుడు బంగారు ఆభరణాలను ముందుంచాడు. ఈ క్రమంలో అతడి దృష్టి మరల్చి 10 గ్రాముల బరువున్న రెండు లాకెట్లతో అక్కడి నుంచి ఉడాయించింది. ఆ తర్వాత గమనించిన యజమాని భాగ్యలక్ష్మి వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని బోరబండ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. సికింద్రాబాద్ పీజీ కళాశాల ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్.ఐ జయచంద్ర సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు ఇక్కడికి చేరకుని పరీక్షించగా చనిపోయినట్లు గుర్తించారు. దీంతో మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి తెల్లటి షర్టు, తెల్లటి ప్యాంటు ధరించి ఉన్నాడు. 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే 040- 27853589 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పైపులైన్ పనులు చేపట్టాలి

బోరబండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్‌లో తాగునీటి, మురుగునీటి సమస్య పరిష్కారం కోసం కొత్త పైపులైను వేయాలని కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కోరారు. ఈ మేరకు ఎస్.ఆర్. నగర్ లోని కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్‌కు కలిసి ఆయన జలమండలి జనరల్ మేనేజర్ హరిశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం ఎం.డి. వాహబ్, మేనేజర్‌లు రాజేందర్. జయప్రకాష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నాట్యం భారతీయ సంస్కృతికి చిహ్నం

● ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్

పద్మారావునగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యం అంటే భారతీయ సంస్కృతికి చిహ్నమని ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ లావిడియా జీవన్ లాల్ అన్నారు. పద్మారావునగర్‌లోని ఫస్ట్‌క్రై డాట్ కామ్ పాఠశాలలో సంకల్పం నాట్య అకాడమీని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభనరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ మాట్లాడుతూ యువతకు భారతీయ నాట్యం నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. అకాడమి చైర్మన్ కొత్త కల్పన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పిల్లలకు నాట్యం అందించాలనే ఉద్దేశంతో అకాడమిని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రపంచ నాట్య దినోత్సవం రోజున ఈ అకాడమీని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. మోతె శోభన్‌రెడ్డి, మోండా మార్కెట్ కార్పొరేటర్ దీపిక, సామాజిక కార్యకర్తలు లక్ష్మణ్, గోపు రమణ, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, కూచిపూడి నాట్య గురువు శిరీష, సుప్రియలు హాజరయ్యారు.


ప్రథమ చికిత్స కిట్లతో ట్రాఫిక్ పోలీసులు, అధికారులు, ఆస్పత్రి సిబ్బంది

సీపీఆర్, ప్రథమ చికిత్సలపై అవగాహన

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రాణాలు కాపాడి పునర్జన్మ ఇచ్చే సీపీఆర్, ప్రథమ చికిత్సలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. నార్త్ జోన్ ట్రాఫిక్ సిబ్బందికి సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సీపీఆర్, ప్రథమ చికిత్స శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, వడదెబ్బ, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు బాధితుల ప్రాణాలు కాపాడడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ ఆస్పత్రి వారు మొబైల్ డ్యూటీ ఆఫీసర్‌లకు ప్రథమ చికిత్స కిట్లు అందజేయడంతో పాటు ఎలా ఉపయోగించాలో వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆస్పత్రి జీఎం హరిప్రసాద్, డాక్టర్ అలీ అహ్మద్, రమేష్, నార్త్ జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్‌రాములు, ఉపశంకర్, భాస్కర్, మధు, పాపయ్య, రవికుమార్, ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



● నీటి కనెక్షన్లకు వినతి

రసూల్‌పురాలో నిర్మించిన నూతన మంచినీటి పైప్‌లైన్ నుంచి బస్తీవాసులకు నీటి కనెక్షన్లు ఇవ్వాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ వాటర్ సెక్షన్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పిస్తున్న టి.ఎన్.శ్రీనివాస్

- (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)


తహసీల్దార్ అశోక్ దంపతులకు ఘన సన్మానం

పదవీ విరమణ వీడ్కోలు సభ

తిరుమలగిరి ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదవిలో 32 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా సేవలు అందించడం తహసీల్దార్ అశోక్‌కుమార్‌కే సాధ్యమైనదని హైదరాబాద్ సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు రామక్రిష్ణ, సాయికుమార్‌లు కొనియాడారు. తిరుమలగిరి మండలం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ పదవి విరమణ అభినందన సభలో పాల్గొని వారిని సన్మానించారు. కార్యక్రమంలో మారేడుపల్లి మండల తహసీల్దార్ భీమయ్య గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ హారిక, సర్వేయర్ వెంకటేష్, సునీల్ కుమార్(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), తులసీరాం(సీనియర్ అసిస్టెంట్), జూనియర్ అసిస్టెంట్‌లు సాయి శరత్, సమ్మయ్య, శ్రావణి, శైలజ, అధికారి దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ సమాచారం

యువతి అదృశ్యం


కీర్తి (ఫైల్)

తిరుమలగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ కార్యాలయంలో టెలికాలర్‌గా పనిచేస్తున్న ఒక యువతి అదృశ్యమైన ఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి వివరాల ప్రకారం లాలమియా బస్తీలో నివసిస్తున్న విజయలక్ష్మి, శ్రీనివాస్‌ల కుమార్తె కీర్తి(32) ఈసీఐఎల్ ప్రాంతంలోని ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో టెలికాలర్‌గా పనిచేస్తుంది. 22న సాయంత్రం క్లయింట్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన కీర్తి ఇప్పటివరకు తిరిగి రాలేదు. దీంతో మంగళవారం రాత్రి ఆమె తల్లి విజయలక్ష్మి తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం..



లాల్‌బజార్ మేరీమాతా మందిరం వద్ద గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు తిరుమలగిరి పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇల్లు అద్దెకు తీసుకుంటానని నమ్మించి రూ.1.30 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న ఇంటిని అద్దెకు ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో ప్రయత్నించిన మహిళను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుంచి రూ.1.30 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలో నివసించే గృహిణి తమ ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు క్వికర్ యాప్‌లో ఇంటి వివరాలు పోస్ట్ చేసింది. ఆర్మీ అధికారిని అంటూ సంప్రదించిన సైబర్ నేరగాడు తాను ఇల్లు అద్దెకు తీసుకుంటానని, దీనికి సంబంధించిన చెల్లింపులు ఆర్మీ అకౌంటెంట్ చేస్తాడని చెప్పాడు. ఆర్మీ అకౌంటెంట్‌ను అంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడు, ముందుగా డబ్బు పంపితే రెట్టింపు పంపుతామని, ఇది ఆర్మీ వాళ్ల చెల్లింపులు చేసే విధానం అని చెప్పాడు. నమ్మకం కలిగించేందుకు ముందుగా రూ. 5 పంపగా, ఆమె ఖాతాలోకి రూ.10 జమ అయ్యాయి, దాంతో మహిళకు నమ్మకం కుదిరింది. ఇంటికి ఇవ్వాల్సిన అడ్వాన్స్ మొత్తాన్ని సైబర్ నేరగాడి ఖాతాకు పంపింది. రెట్టింపు డబ్బు ఇస్తానన్న సైబర్ నేరగాడు పలు చార్జీల పేరు చెప్పి ఆమె ఖాతా ఖాళీ చేశాడు. మీరు పంపిన డబ్బుకు రెట్టింపు డబ్బు మీ ఖాతాలో జమ కాబోతుందని చెప్పి నకిలీ ఆర్‌టీజీఎస్ పత్రాలు పంపాడు. మీ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేని కారణంగా డబ్బు జమ కావడం లేదని చెబుతూ, ఆమె బ్యాంకు ఖాతా వివరాలు, సీవీవీ వివరాలు తీసుకున్నాడు. పోయిన డబ్బు రాబట్టుకునేందుకు బాధితురాలు పర్సనల్ లోన్ తీసుకొని డబ్బు ఖాతాలో ఉంచింది. ఆమె ఖాతాలో డబ్బును కూడా సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీనిపై ప్రశ్నించగా మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు మీ డబ్బు మీ ఖాతాలో పడుతుందని నేరగాళ్లు ఆమెను నమ్మించారు. చివరకు డబ్బు రాకపోవడం, మరింత డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ వివరాల ప్రకారం మారేడుపల్లిలోని రాంసార్ హోటల్ ఎదురుగా గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేరాల కట్టడికి నిఘా నేత్రాలు


ట్యాంక్ బండ్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన అత్యాధునిక ఏఎన్‌పిఆర్ సిసి కెమెరాలు

బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 120 సీసీ కెమెరాల ఏర్పాటు


బోయినపల్లి పోలీస్ స్టేషన్

బోయినపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బాహుబలి పోలీస్‌స్టేషన్‌గా పిలిచే బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు నేరాలను నివారించడంలో, నేరస్తులను పట్టుకోవడంలో సహాయపడతాయి. అదనంగా అవి ప్రజల భద్రతను పెంచి, పోలీసులకు పనిని సులభతరం చేస్తాయి. అందుకే బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11 కిలోమీటర్ల మేరకు అడుగడుగునా 120 అత్యాధునిక ఆడియో, వీడియో సీసీ కెమెరాలను జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్(జీఈఎఫ్) సహకారంతో అమర్చారు. ఇందులో 3 ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రిక్గ్నైజ్డ్ కెమెరాలు, 40 ఎంవి జడ్(మోటరైజ్డ్ వెరిఫోకాల్ జూమ్) కెమెరాలు, 80 ఫిక్స్‌డ్ విత్ ఆడియో అత్యాధునిక కెమెరాలు ఉన్నాయి. బోయినపల్లి పరిధిలో నేరాలకు పాల్పడితే నేరస్తుడి చిత్రాలు కనిపించేవిధంగా అమర్చారు. ఈ నిఘా వ్యవస్థకు సంబంధించిన సర్వర్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు నార్త్ జోన్ డీసీపీ రష్మిత పెరుమాళ్ అనుమతితో సీఎస్‌ఆర్ నిధుల నుంచి, జీఈఎఫ్ఐ సహకారంతో 32 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలను బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డిఐ సర్దార్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీటిని అమర్చడానికి అన్ని చౌరస్తాలు, కూడళ్లను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించే ప్రాంతాలతో పాటు అధికంగా రద్దీ ఉండే ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించిన ట్రయల్‌ను మంగళవారం పరిశీలించారు. రెండు మూడు రోజులలో పోలీస్ ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సమాచారం.

నేరాలను తగ్గించవచ్చు



సీసీ కెమెరాలు నేరాలను అరికట్టడానికి సహాయపడతాయి. నేరస్తులు నేరాలకు పాల్పడే అవకాశం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా నేరస్తుడు నిఘా నేత్రాల నుంచి తప్పించుకునే ఆస్కారమే లేనివిధంగా ఏర్పాటు చేశాం.

- లక్ష్మీనారాయణరెడ్డి, ఇన్‌స్పెక్టర్

అదనపు ప్రయోజనాలు



జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో భద్రతకు ఉపయోగపడతాయి. ప్రజల విశ్వాసాన్ని పెంచి పోలీసులపై నమ్మకం కలిగిస్తాయి. నేరాల నియంత్రణకు సహాయపడతాయి.

- సర్దార్ నాయక్, డీఐ

పుస్తెలతాడు చోరీ

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని జెక్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లో బీరువాలో ఉన్న పుస్తెలతాడు చోరీకి గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం జెక్ కాలనీలోని చల్లా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌కు చెందిన అడుసుమల్లి సాయి శ్రీలేఖ ప్రైవేట్ ఉద్యోగి. 28న ఉదయం పెస్ట్ కంట్రోల్ నిమిత్తం ఆనంద్ అనే వ్యక్తి వచ్చి కొద్దిసేపటి అనంతరం వెళ్లిపోయాడు. సాయంత్రం బీరువా తీయగా అందులో ఉండాల్సిన 4.4 గ్రాముల బంగారు పుస్తెలతాడు కనిపించలేదు. పుస్తెలతాడు కనిపించడం లేదంటూ బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ పీ.జీ కళాశాల ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడని పోలీసులకు సమాచారం అందడంతో ఎస్.ఐ జయచంద్ర సిబ్బందితో అక్కడికి వెళ్లారు. వెళ్లిన వెంటనే 108 అంబులెన్స్‌ను రప్పించారు. వైద్య సిబ్బంది అతడిని పరీక్షించగా చనిపోయినట్లు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెల్లటి చొక్కా, తెల్లటి ప్యాంట్ ఉంది. అతడి వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుంది. వివరాలు తెలిసిన వారు 040- 27853589 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ జయచంద్ర తెలిపారు.

రూ.15 లక్షల విలువైన 150 సెల్‌ఫోన్ల రికవరీ

● బాధితులకు అందజేత


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే డీఎస్పీ జావిద్

అడ్డగుట్ట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో నాలుగు నెలల కాలంలో రైలు ప్రయాణం చేస్తూ ప్రయాణికులు పోగొట్టుకున్న 150 సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు మంగళవారం బాధితులకు అందజేశారు. లాలాగూడలోని సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైల్వే డీఎస్పీ జావిద్ వీటిని బాధితులకు అందజేసి మీడియాకు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్, కాచిగూడ ఇతర రైల్వే పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ 19 వరకు రైళ్లలో ప్రయాణం చేసిన ప్రయాణికుల ఫోన్లు చోరీకి గురయ్యాయి. వీటికి సంబంధించి బాధితులు సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటిపై దర్యాప్తు చేసిన రైల్వే పోలీసులు సికింద్రాబాద్ డివిజన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు ఇతర రాష్ట్రాలకు చేరినట్లు టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా గుర్తించారు. ఉత్తర ప్రదేశ్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు బిహార్‌లలో అక్కడి పోలీసుల సాయంతో దర్యాప్తు చేసి నిందితులనుంచి 150 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, కాచిగూడ సీఐ ఎల్లప్ప, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న తేలెకుంట సతీష్

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

తిరుమలగిరి ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా పాట్నీ నుంచి శామీర్‌పేట వరకు రోడ్డుకు ఇరువైపులా స్థలాలను కోల్పోతున్న భూ నిర్వాసితులకు సరైన న్యాయం చేయాలని భూ నిర్వాసితుల జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ డిమాండ్ చేశారు. మంగళవారం టీచర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కోల్పోతున్న సదరు సభ్యులకు మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలో భూనిర్వాసితులు అధికసంఖ్యలో పాల్గొని వారి సమస్యలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నోడల్ అధికారి దివ్య

ప్రజావాణికి 308 దరఖాస్తులు

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి మొత్తం 308 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను తీసుకొని వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 104, విద్యుత్‌కు 18, రెవెన్యూకు 44, ఇందిరమ్మ ఇండ్ల కోస 65, ఇతర శాఖలకు 77 దరఖాస్తులు అందినట్లు అధికారి తెలిపారు.

సారథి పరివాహన్ పోర్టల్‌తో రాష్ట్ర రవాణాశాఖ అనుసంధానం

తిరుమలగిరి ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ పౌరులకు మెరుగైన సేవలను అందించడానికి కొత్త సంస్కరణలను ప్రారంభించింది. అందులో భాగంగానే కేంద్రం రూపొందించిన సారథి పరివాహన్ పోర్టల్‌తో రాష్ట్ర రవాణాశాఖ అనుసంధానం కానుంది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం 30వ తేదీ సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయాన్ని అనుసంధానిస్తూ ప్రారంభించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రంలోని ఇతర కార్యాలయాల సమాచారాన్ని సారథి పోర్టల్‌తో అనుసంధానం చేయనున్నట్లు రవాణాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పౌరుల అవసరాల రీత్యా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినవారు డ్రైవింగ్ లైసెన్సులో చిరునామా మార్చుకోవడంతో పాటు లైసెన్సులకు సంబంధించిన ఇతర త్రా సేవలు ఈ పోర్టల్ ద్వారా సులభతరమవుతాయి. ఆధునీకరించిన తిరుమలగిరి ఆర్టీఓ భవన కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4గంటలకు సారధి పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు ఆర్టీఓ అధికారులు పేర్కొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మర్రి రవీందర్‌రెడ్డి, షేక్ గౌస్

చలివేంద్రం ప్రారంభం

బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్ బస్టాప్‌లో 28 సంవత్సరాలుగా మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్ మర్రి చెన్నారెడ్డి పేరుమీద సీనియర్ కాంగ్రెస్ నేత షేక్‌గౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాన్ని చెన్నారెడ్డి కుమారుడు మర్రి రవీంద్రారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్రి చెన్నారెడ్డి స్మారకార్థం ప్రతి సంవత్సరం చలివేంద్రాన్ని షేక్ గౌస్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమేష్, నాయకులు అభిషేక్ అడపా, రాజేందర్, మునీర్‌ఖాన్, హనిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



● మౌనదీక్ష

ముష్కరుల కాల్పుల్లో మరణించిన వారికి నివాళిగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌనదీక్ష, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ సామల హేమ, ఏడుకొండలు, జలంధర్‌రెడ్డి, ప్రభుగుప్తా, హరి, భాస్కర్‌గిరి, శ్రీను, వినోద్, బాలరాజ్‌యాదవ్, శైలేందర్, బాబూరావు, కొండల్, అశోక్, అజీజ్, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణముదిరాజ్ పాల్గొన్నారు.

- (సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)


మహిళలకు మందులను అందజేస్తున్న సంకల్ప సంస్థ ప్రతినిధులు

ఉచిత ఆరోగ్య శిబిరం

పద్మారావునగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద వహించాలని సంకల్పం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి పద్మారావునగర్‌లోని తపాలా కార్యాలయం వద్ద సంకల్పం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కల్పన, ప్రధాన కార్యదర్శి రజిత, శ్యామల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. పిల్లల వైద్యులు, దంత, కంటి, గైనకాలజీ వైద్యులు శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, మోతె శోభన్‌రెడ్డిలు ప్రారంభించారు. లక్ష్మణ్,గోపు రమణ, డా.వెంకట్‌లు పాల్గొన్నారు.


సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసిన భానుక నర్మద తదితరులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సికింద్రాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌కు కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధుకర్ నాయక్‌కు ఆమె వినతి పత్రం సమర్పించారు. నాలాల పూడికతీత పనులు, వీధి దీపాలు, త్రాగునీరు, డ్రైనేజీ నిర్మాణం తదితర పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ, మోండ మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, సీనియర్ నాయకులు టోపీ శంకర్, విజయానంద్, సతీష్, ధనంజయచారి, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, ఆయా వార్డుల బీజేపీ అధ్యక్షులు రాకేష్, శ్రవణ్; అరుణ్; సచిన్, సంతోస్, పవన్, ప్రవీణ్, జితేందర్ పాల్గొన్నారు.


డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాణికేశ్వర్ నగర్ బస్తీవాసులు

సమస్యల పరిష్కారానికి వినతి

తార్నాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాణికేశ్వర్ నగర్ బస్తీవాసులు మంగళవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. దాంతో స్పందించిన డిప్యూటీ మేయర్ బస్తీవాసుల వినతి మేరకు సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కుమార్, ఉపాధ్యక్షుడు ఏ.మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు, కోశాధికారి పి.శ్రీనివాస్, హరి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.


ఇన్‌కమ్ టాక్స్ అధికారి జీవన్‌లాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కొత్త కల్పన

కూచిపూడి నాట్యం భారతీయ సంస్కృతికి చిహ్నం

పద్మారావునగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యం అంటే భారతీయ సంస్కృతికి చిహ్నమని ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ లావిడియా జీవన్ లాల్ అన్నారు. పద్మారావునగర్‌లోని ఫస్ట్‌క్రై డాట్ కామ్ పాఠశాలలో సంకల్పం నాట్య అకాడమీని ఇన్‌కమ్‌టాక్స్ కమిషనర్ లావిడియా జీవన్‌లాల్, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభనరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవన్‌లాల్ మాట్లాడుతూ యువతకు భారతీయ నాట్యం నేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు. అకాడమి చైర్మన్ కొత్త కల్పన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పిల్లలకు నాట్యం అందించాలనే ఉద్దేశంతో అకాడమిని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రపంచ నాట్య దినోత్సవం రోజున ఈ అకాడమీని ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమానికి మోతె శోభన్‌రెడ్డి, మోండా మార్కెట్ కార్పొరేటర్ దీపిక, సామాజిక కార్యకర్తలు లక్ష్మణ్, గోపు రమణ, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, కూచిపూడి నాట్య గురువు శిరీష పోలవరపు, డా.సుప్రియలు హాజరయ్యారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు.

- బేగంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)